క్లుప్తంగా

మెస్ చార్జీలు విడుదల చేయాలి



జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరురూరల్: పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం బనవాసి దగ్గర ఆర్‌పీవీఎఫ్, ఆర్‌వీపీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు నల్లారెడ్డి, ఖాజా తదితరులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో 6 నెలల నుంచి మెస్ చార్జీలు ఇవ్వలేదని చెప్పారు. వీటితో పాటు కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఎమ్మిగనూరు బాలికల ఎస్సీ ప్రీమెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని, సన్నం బియ్యంతో భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు రవి, షేక్షావలి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చెందిన ఏనుగప్ప కుమార్తె, సుగుణమ్మ కుమార్తె వివాహాలకు రూ.10,000 వేలు చొప్పున ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



మద్దికెరలో నిర్మాణం పూర్తయిన కార్యాలయాలు

మద్దికెర: ప్రజలు, రైతులకు గ్రామాల్లోనే సత్వర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు మండల కేంద్రమైన మద్దికెరలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన సచివాలయం-4, రైతు భరోసా కేంద్రాలు-1, 4 నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. త్వరలోనే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ఆ భవనాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

కుల గణనపై అవగాహన

చిప్పగిరి: డిసెంబర్ 10వ తేదీ నుంచి చేపట్టే కులగణనపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏఎస్ఓ సంజీవ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కులగణన యాప్‌లో సమాచారం ఏ విధంగా అప్‌లోడ్ చేయాలనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. శిక్షణ పొందిన వారు తమ గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది, వాలంటీర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీఓ సీవీ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న, కార్యదర్శులు, నారాయణ స్వామి, సిసింద్రి, నాయక్, నరేంద్ర, సుధీర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి

మద్దికెర: పంచాయతీ సభ్యులతో పాటు ప్రజలు సహకరించినపుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా, రోడ్లను ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టినా పంచాయతీ రాజ్ చట్టం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. గ్రామంలో నీటి కొరత రాకుండా మరో రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ నాగేష్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్.లింగందిన్నె, కున్నూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ప్రజల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ఇంకా ఎవరైన అర్హులై ఉండి పథకాలు అందని వారు ఉంటే ఈ యాత్రలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు సోమేష్, ధరణి కుమార్‌లు పాల్గొన్నారు.



చిన్నహోతూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గోనెగండ్లలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చందోలి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్



చింతకుంటలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి



కడమకుంట్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. మండలంలోని చిన్నహోతూరు సచివాలయంలో సర్పంచ్ హరికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును గుమ్మనూరు ఈశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. చిన్నహోతూరులో సంక్షేమ పథకాల ద్వారా రూ.20 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు ఈఓఆర్డీ సూర్య నరసింహా రెడ్డి తెలిపారు. అనంతరం ఈశ్వర్ వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, అశోక్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఎంతో లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ సచివాలయ మండలాధ్యక్షులు నాగేష్, హనుమంతు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, నాయకులు రామాంజనేయులు పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం కడమకుంట్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పేదలకు అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు.



కోగిలతోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

గోనెగండ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే గోనెగండ్లలో కన్వీనర్ రహిమాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు 8, 9, 10 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఎంపీటీసీ జైపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాయని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందోలి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ నారాయణదాస్ మాట్లాడుతూ.. గతంలో గ్రామీణ ప్రాంతవాసులు ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా సచివాలయ వ్యవస్థతో స్థానికంగానే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు సోమశేఖర్, టీఎండీ హుసేన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: కోగిలతోట గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు 'ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. అలాగే కరపత్రాలను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, జగనన్న అందిస్తున్న పథకాలను వివరించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, నాగప్ప, వెంకటేష్, ఎంపీటీసీ మల్లికార్జున, రామకృష్ణ, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

చేసిన మేలును వివరిద్దాం

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన పథకాలను ప్రజలకు వివరిద్దామని పార్టీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కన్వీనర్ భీమప్పచౌదరి ఆధ్వర్యంలో చింతకుంట గ్రామంలో 'ఏపీకి సీఎం జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సభలో నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన 99 శాతం హామీలను నెరవేర్చారని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజలందరూ సంతృప్తికరంగా ఉన్నారన్నారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ లింగప్ప, ఎంపీపీ నెట్టికంటమ్మ, తహసీల్దార్ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్ధన్‌నాయుడు రంజిత్, పరశురాం, శ్రీనివాసులు, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన

మద్దికెర: మద్దికెరలోని రాంనగర్, సాయినగర్ కాలనీలకు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.32 లక్షలతో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకును నిర్మించేందుకు చర్యలు చేపట్టిందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్, ఏఈ మయాంక్, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు అన్నారు. మంగళవారం కాలనీలకు అనుకూలంగా ఉండేందుకు ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలు ఏర్పడి దాదాపు 30 ఏళ్లు అవుతున్నాయని అయితే నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించడంతో త్వరలోనే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు.

గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం



స్పందనలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో మంగళవారం గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, ఈఓపీఆర్డీ మల్లికార్జున, సర్పంచ్ గాదిలింగప్ప పాల్గొన్నారు. గ్రామాల్లోని సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమం చేపట్టినట్లు వారు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం శివయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందన, సీసీ వెంకటరత్నం, సచివాలయ కన్వీనర్ మహాలింగ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

హొళగుంద: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. సీబీఎస్‌ఈ సెకండ్ లాంగ్వేజ్ కింద తెలుగుతో పాటు కన్నడ, ఉర్దూను కొనసాగించేలా తాము చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇవ్వాలని ఆ సంఘాల నాయకులు కోరడంతో ప్రజా ప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ సుహాసినమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు కన్నడ, ఉర్దూ సంఘాల నాయకులు గవిసిద్దప్ప, రుద్రగౌడ్, ఆదాం, సుబాన్, హమీద్, ఇర్ఫాన్ తదితరులు మాట్లాడుతూ.. సెకండ్ లాంగ్వేజ్ కింద కన్నడ, ఉర్దూను కొనసాగించకపోవడం వల్ల ఆ మీడియం విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఆ లాంగ్వేజీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని వాపోయారు. ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, మల్లికార్జున, ఉరుకుందప్ప, శివన్న తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పూలేకు ఘననివాళి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్, ఎమ్మెల్సీ మధుసూదన్




దేవనకొండలో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న పట్నం రాజేశ్వరి తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పూలే చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వెనకబడిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, సునీల్‌కుమార్, షబ్బీర్ అహమ్మద్, యుకె రాజశేర్, కేశన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే వీరశైవ లింగాయత్ చైర్మన్ రుద్రగౌడ్ నివాసంలో పూలే చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేవనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ విగ్రహాలను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు ఏర్పాటు చేయించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, హెచ్ఎం బజారప్ప, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి



ఆలూరులో హిందూ ధర్మ సమ్మేళనం ర్యాలీ

ఆలూరు: సనాతన ధర్మం ఆచరిస్తూ సన్మార్గంలో నడవాలని జె.హోసళ్లి గ్రామ పురవర్గ మఠం అధిపతి అజాత శంభులింగశివాచార్య స్వామి, ప్రముఖ పండితులు గురురాజ శాస్త్రీ సూచించారు. మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోటవీధిలో కొలువుదీరిన భీమలింగేశ్వర స్వామి ఆలయం నుంచి హిందూ ధర్మ సమ్మేళన ర్యాలీని బెళ్లగుండ ఆంజనేయ స్వామి ఆలయం వరకు నిర్వహించారు. భగవద్గీత, సాయిపారాయణం, హనుమాన్ చాలీసా, అయ్యప్ప స్వామి సంకీర్తనలను ఆలపించారు. మత పెద్దలు జ్ఞానబోధ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమ్మె నోటీసు

హొళగుంద: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు మంగళవారం ఎంఈఓలు జగన్నాథం, సత్యనారాయణలకు ఎమ్మార్సీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

కృష్ణగిరి: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులతో గొడవపడి పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. అమకతాడు గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమారుడు సోమలింగేశ్వరయ్య (23) మూగ అయినప్పటికీ కూలి, గౌండ పనిచేసేవాడు. చేతికి డబ్బులు ఆడడంతో మద్యానికి బానిసకావడంతో పాటు జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ నెల 26న మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా పురుగు మందు వాసన రావడంతో వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేపు మహా రుద్ర యజ్ఞ, హోమాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని రాజరాజేశ్వరి దేవాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన మహా రుద్ర యజ్ఞం, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో పరమేశ్వరుడికి ప్రీతికరమైన రుద్రహోమం, యజ్ఞాలు చేపట్టడంతో భక్తులకు శుభం చేకూరుతుందన్నారు. వేద పండితుల సమక్షంలో గురువారం సాయంత్రం ఐదు గంటలకు లక్ష్మి గణపతి హోమం, రుద్రహోమం, సదర్శన హోమం, ఆదిత్యాది నవగ్రహ హోమం, కాలభైరవ హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మహా రుద్ర యజ్ఞం కార్యక్రమంలో భక్తాదులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు 88863 33463 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

గోనెగండ్ల: స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం విజయ మహిళా మండలి ప్రివెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్, సుఖ వ్యాధుల నివారణ, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేష్ రెడ్డి, విజయ మహిళా మండలి సభ్యులు హసీనా బేగం, ఎస్తేరమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. వ్యాధుల నుంచి కాపాడుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంజునాథ్, కళావతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి రైల్వే గేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున మంగళవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు రైల్వే గేటు వద్దకు వెళ్లగా ఆటో కోసం వేచి ఉన్న రాంపల్లి రామాంజినేయులు వద్ద నుంచి 750 విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని పత్తికొండ కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన

ఆలూరు: నియోజకవర్గంలో ఓటరు జాబితా పక్కాగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల డీటీ గుండాలనాయక్ సమక్షంలో వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 9వ తేదీలోగా ఓటరు దరఖాస్తులన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు యాప్, లేదా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. జనవరి 5న తది ఓటరు జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడు ఉన్నారు.

ప్రజల చెంతకే పాలన



పెద్దకొత్తిలిలో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెలే చెన్నకేశవ రెడ్డి

నందవరం: జాతిపిత మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ శివన్న, ఎంపీటీసీ విజయ్‌మోహన్‌రెడ్డితో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పంటల బీమా, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ విత్తనాలుతో పాటు సలహాలు, సూచనలు అందుతున్నాయన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పెద్దకొత్తిలి గ్రామంలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆవరణలో ఎమ్మెల్యే మొక్కను నాటి నీరు పోశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డిగౌడ్ విరుపాక్షి రెడ్డి, చాంద్‌బాషా, పీఆర్ డీఈఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పీఆర్ ఏఈ జయన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దేవనకొండ: స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధితులు రామాంజనేయులు, ఆ కుటుంబసభ్యులను మంగళవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్ పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా నిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కిట్టు, మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచ్ గుమ్మర్ల స్వామి, రామాంజనేయులు, ఎంపీటీసీ యూసఫ్‌బాషా, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.



రూ.20 వేలు సాయం అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

- ఇదే ఘటన బాధితులకు వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు విరాళం



రూ.50 వేలు విరాళం అందిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆలూరు: హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామంలో కురుబ కులస్తుల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి రూ.50 వేలు విరాళం అందించారు. స్థానిక మంత్రి గుమ్మనూరు జయరాం నివాసంలో మంగళవారం హొళగుంద మండల వైఎస్సార్‌సీపీ నాయకులు భీరప్ప, మైలారప్ప తదితరులకు విరాళం అందజేశారు. అలాగే ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో శ్రీకృష్ణానంద స్వామి ఆశ్రమంలో నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళం ఇచ్చారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

పత్తికొండటౌన్: ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీపీ ఎం.నారాయణదాసు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన పత్తికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. మూడు నెలలకోసారి జరిగే మండల మీట్‌కు కూడా సక్రమంగా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇకపై ఉపేక్షించబోమని, మండల మీట్‌కు సక్రమంగా రాని వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు అడిగే సమస్యలను నోట్ చేసుకుని, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. పత్తికొండ పట్టణం 14, 15 వార్డుల్లోని ఆంజనేయనగర్, శ్రీరాములపేట, కల్లుపెంట వీధి కాలనీల్లో నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరారు. ఎంపీడీఓ కవిత, తహసీల్దార్ విష్ణుప్రసాద్, వైస్ ఎంపీపీలు కురువ బలరాముడు, వడ్డె రంగమ్మ, కోఆప్షన్ సభ్యుడు నజీర్, ఎంఈఓ రమేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు